క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వరికుంటపాడు: తూర్పుబోయమడుగులలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను శుక్రవారం అందజేశారు. వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కరీష్మా 35 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్యజాగ్రత్తలు సూచించారు. ఏఎన్ఎం రమణమ్మ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి

కావలి రూరల్: న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయిస్తే వారు అన్యాయానికి కొమ్ముకాస్తున్నారని పెద్దారం గ్రామానికి చెందిన రైతు బొబ్బల కొండయ్య ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను గత 30 ఏళ్లుగా గ్రామంలోని శివాయి భూమిని సాగు చేసుకుంటున్నానని తెలిపారు. అందులోని జామాయిల్ చెట్లను తాము ఊరిలో లేని సమయంలో తన సమీప బంధువు అక్క కాకు కొండమ్మ, ఆమె కుమారుడు కొండయ్య అక్రమంగా నరికి కలపను తరలించుకుపోయారని వాపోయారు. ఈ విషయమై న్యాయం చేయాలని కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని, తహసీల్దార్‌ను ఆశ్రయిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తిప్పుకుంటున్నారని ఆరోపించారు. ఇద్దరు కుమారులను పోగొట్టుకుని దుఃఖంలో ఉన్న తమకు పోలీసులు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



అల్లూరు: స్థానిక రామకృష్ణ కళాశాల వద్ద వాటర్‌ట్యాంక్ మెయిన్ పైపులైన్ మరమ్మతులకు గురవడంతో పలు కాలనీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో కమిషనర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పైపులైన్ మరమ్మతు పనులను ప్రారంభించారు. శనివారంలోగా పైపులైన్ మరమ్మతులను పూర్తి చేసి తాగునీటి సరఫరా అందించేందుకు కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు. కాగా పైపులైన్ మరమ్మతు పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, మధురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

గ్రిగ్ పోటీల విజేతలకు అభినందనలు



సంగం: ఇటీవల జరిగిన ఆత్మకూరు నియోజకవర్గస్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో సంగం ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం అభినందనీయమని హెచ్ఎం మాల్యాద్రి పేర్కొన్నారు. సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రిగ్ పోటీల విజేతల అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మధును ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. విద్యార్థులను అభినందించారు.

గంటల వ్యవధిలో బాలిక గుర్తింపు

ఆత్మకూరు: ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిన విషయంపై కుటుంబసభ్యులు ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు గంటల వ్యవధిలోనే బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై ఎం శివశంకర్రావు కథనం మేరకు.. పట్టణంలోని హిల్‌రోడ్ ప్రాంతానికి చెందిన ఓ బాలికకు వైఎస్సార్ జిల్లాకు చెందిన బాలుడు మాయమాటలు చెప్పి శుక్రవారం ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లాడు. పనికి వెళ్లిన తల్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. కూతురు కనిపించకపోవడంతో ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన ఎస్సై శివశంకర్రావు మరో ఎస్సై రాజేష్, సిబ్బందితో కలిసి వెతకడం ప్రారంభించారు. బాలిక వద్ద సెల్‌ఫోన్ ఉండడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారు ఎక్కడున్నారో కనుకున్నారు. ఏఎస్‌పేట మండల శివార్లలో వారిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె తల్లికి అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి బాలికను గుర్తించిన ఎస్సైలు, సిబ్బందిని డీఎస్పీ ఎస్.కోటారెడ్డి అభినందించారు.

శనగ పంటకోత ప్రయోగం



వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడుకు చెందిన రైతు నల్లగొర్ల వెంగళరావు పొలంలో శుక్రవారం శనగ పంటకోత ప్రయోగం చేపట్టారు. ఏఎస్ఓ కేశవనారాయణ వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి దిగుబడులను అంచనా వేశారు. ఎకరాకు సుమారు ఐదు క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తున్నట్లు అంచనా వేసినట్లు ఏఎస్ఓ తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించేందుకు పంట కోత ప్రయోగం చేపడుతున్నామని వివరించారు. వీఏఏ చంద్రశేఖర్, బీమా ప్రతినిధి నవీన్ పాల్గొన్నారు.

వీడని హత్య కేసు మిస్టరీ

- వెంగాయగారిపాళెం వద్ద వివాహితను హత్య చేసి తగులబెట్టిన దుండగులు
- ఏడాది గడుస్తున్నా కొలిక్కిరాని కేసు దర్యాప్తు



పోలీసులకు లభించిన హత్యకు గురైన వివాహితకు సంబంధించిన ఆధారాలు

కావలి: గుర్తుతెలియని వివాహితను దుండగులు కిరాతకంగా హత్యచేశారు. ఆమె ఆనవాళ్లు లభ్యం కాకుండా తగులబెట్టారు. గతేడాది మార్చి 6న కావలిలో సంచలనం రేపిన ఈ హత్య కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. అప్పట్లో సంచలనం రేపిన ఈ కేసును వెంటనే ఛేదించి నిందితులను పట్టుకుంటామని పోలీసులు ప్రకటించారు. ఏడాది గడుస్తున్నా కిరాతకంగా హత్య చేసిన దుండగులు ఎవరు, హత్య కాబడిన వివాహిత ఎవరు... అనే విషయాలను పోలీసులు నిగ్గు తేల్చలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముందుకు సాగని దర్యాప్తు

గతేడాది మార్చి 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత కావలి శివారు ప్రాంతమైన వెంగాయగారిపాళెం వద్ద ఒక లేఅవుట్‌లో గుర్తుతెలియని వివాహితను దుండగులు దారుణంగా హత్య చేసి తగులబెట్టారు. 7న ఉదయం ఆరు గంటల ప్రాంతంలో కల్లుగీసేందుకు వెళ్లిన కల్లుగీత కార్మికులు మృతదేహం తగులబడుతున్న విషయాన్ని గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించే సమయానికే మృతదేహం బాగా కాలిపోయింది. మొహం గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో వివాహిత ఆనవాళ్లు తెలియలేదు. మృతదేహం నుంచి స్వాధీనం చేసుకున్న కాలిమెట్లు, తాళిబొట్టు, చెవి కమ్మలు, పట్టీలు, చేతికి కట్టుకునే దారం తప్ప మిగిలిన ఎటువంటి ఆనవాళ్లు లభించలేదు. అప్పట్లో వాటి ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ప్రకటించారు. ఘటనా స్థలం హైవేకు పక్కనే ఉండడంతో ఎక్కడో చంపేసి ఇక్కడికి తీసుకొచ్చి తగులబెట్టి ఉంటారనే అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. అయినా ఈ కేసులో పురోగతి సాధించలేదు.

అప్పట్లో తీవ్ర సంచలనం

గతేడాది మార్చి 6న జరిగిన వివాహిత హత్య కేసు ప్రశాంతంగా ఉన్న కావలి పట్టణంలో తీవ్ర సంచలనం సృష్టించింది. పట్టణ శివార్లలో, హైవే పక్కనే మహిళను హత్య చేసి తగులబెట్టడం పట్టణవాసులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు కూడా మొదట్లో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. పలువురు అనుమానితులను విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందో..ఏమో కేసు విచారణ మధ్యలోనే అటకెక్కింది. ఘటనా స్థలంలో వాహనంలో మహిళను తీసుకొచ్చి తగులబెట్టినట్లుగా స్పష్టమైన టైర్ మార్కులను పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల ఆధారంగా శాస్త్రీయ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేసి ఉంటే నిందితులు పట్టుబడి ఉండేవారు.

> **సీసీఎస్ డీఎస్పీ విచారణ చేస్తున్నారు**
>
> నెల్లూరులోని సెంట్రల్ క్రైం స్టేషన్ డీఎస్పీ ఆధ్వర్యంలోని బృందం మహిళ హత్య కేసును విచారణ జరుపుతున్నారు. ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే కేసు దర్యాప్తును కొలిక్కితీసుకొచ్చి నిందితులను పట్టుకోవడంతో పాటు హత్యకు గురైన మహిళ కూడా గుర్తిస్తాం.
>
> –ఎం వెంకట రమణ, డీఎస్పీ, కావలి

వివాహిత ఎవరో?

వెంగాయగారిపాళెం వద్ద జాతీయ రహదారి సమీపంలో హత్యకు గురైన వివాహిత ఆనవాళ్లను గుర్తించేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మహిళ మొఖం పూర్తిగా కాలిపోవడంతో ఆమె వివరాలు తెలియలేదు. హతురాలు 552 అడుగుల ఎత్తుతో సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్యన వయస్సు కలిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాలో మహిళ ఎడమ చేతికి ఉన్న బ్లూ, గ్రీన్ కలర్ నూలు ధారాలు, పంజాబీ డ్రెస్, పింక్ కలర్ ఫ్యాన్సీ కమ్మలు, రోల్డ్‌గోల్డ్ చైన్, గోల్డ్‌కలర్ పట్టీలు, చుట్లు ఉండే వెండి మెట్టెలు, తాళి బొట్టు, తాయిత్తు, తదితరాలను పోలీసులు సేకరించారు. ఈ వివరాలతో సదరు మహిళ ఆనవాళ్లు తెలుసుకునేందుకు పోలీసులు తమకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ మేరకు ఉపయోగించారో తెలియదు కేసు దర్యాప్తులో పురోగతి సాధించలేదు. పోలీసులు దర్యాప్తును అటకెక్కించడంతోనే మహిళను పాశవికంగా హత్యచేసిన దుండగులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



సంగం: పడమటిపాళెంలోని సాయిబాబా మందిరాన్ని నిర్మించి 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కుంభాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత సాయిబాబాకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైభవంగా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దంపతులుపాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని ఎస్సీ చింతల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులు వర్క్‌బుక్‌లు పూర్తిచేసేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం నాణ్యతను రుచిచూశారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన



మొక్కలు నాటుతున్న డీపీఓ చిరంజీవి

కావలి రూరల్: మండలంలోని చలంచర్ల పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని హరిత రాయబారులకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకోసం చలంచర్లలోని చెత్త నుంచి సంపద తయారు కేంద్రాన్ని ఎంపిక చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ ఇరువూరి అనూష, డీఎల్‌పీఓ ఆదినారాయణ, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



గురుకుల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఎంహెచ్ఓ వెంకటప్రసాద్

చేజర్ల : కిశోర బాలికలు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని ఏడీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ సూచించారు. మండలంలోని చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, మందుల గదిని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆదూరుపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు పరిసరాల, వ్యక్తిగత శుభ్రత, బాల్యవివాహలతో కలిగే అనర్థాలు, పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆయన వెంట చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన్, గురుకులం ప్రిన్సిపల్ శైలజాకుమారి ఉన్నారు.

టీడీపీ నాయకుడి పెట్రో డ్రామా



కావలి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకుడు మండవ వెంకట్రావు శుక్రవారం పెట్రో డ్రామాను రక్తికట్టించాడు.గతంలో పట్టణంలోని ముసునూరులో దివ్యాంగులకు నివేశన స్థలాలు పంపిణీ చేశారు. అందులో జరిగిన అవకతవకలకు మండవ వెంకట్రావు బాధ్యుడని దివ్యాంగుల సంఘ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండవ వెంకట్రావు పెట్రోల్ బాటిల్‌తో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాడు. దివ్యాంగుల కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న ఇతరులను అడ్డుకోవాలని కోరుతూ పెట్రోల్‌ను పైన పోసుకుని హల్‌చల్ చేశాడు. విలేకరులు ఫొటోలు తీసిన వెంటనే వెళ్లిపోయాడు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ మాధవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

- బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు సోము వీర్రాజు



ఆత్మకూరు: విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు సోము వీర్రాజు

ఆత్మకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బీజేపీ నాయకులతో పదాధికారుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశానికి సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి పనులను గమనించి బీజేపీ అభ్యర్థిని మొదటి ప్రాధాన్యత ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. జిల్లాలో ఇంటర్ విద్యార్థులను పట్టభద్రులుగా పేర్కొంటూ దొంగ ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు సురేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు సూర్యనారాయణరాజు, కే సుధాకర్‌రెడ్డి, సుధాకర్, భరత్, విజయలక్ష్మి, కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండల కేంద్రమైన సంగంలోని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాకు విజయలక్ష్మి నివాసంలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు సోము వీర్రాజు ఎమ్మెల్సీ ఎన్నికలపై ముఖ్యనాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. బీజేపీ నాయకులు సురేష్‌రెడ్డి, సూర్యనారాయణరాజు, మాల్యాద్రి, డాంగే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతి విద్యార్థినికి పెద్దకష్టం

- పాడేరు బాలికకు దెబ్బతిన్న రెండు కిడ్నీలు
- శక్తికి మించి వైద్యానికి ఖర్చు చేసిన తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుహాన

చేజర్ల: పేద కుటుంబానికి చెందిన ఆ చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. ఎంతో హుషారుగా ఆడుతూ పాడుతూ తిరిగే ఆ పాపకు రెండు కిడ్నీలు పాడవడంతో తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. కూతురి ప్రాణాలను కాపాడుకునేందుకు శక్తికి మించిన భారం కావడంతో ఆపన్నహస్తం కోసం దీనంగా ఎదురు చూస్తోంది. వివరాలు.. చేజర్ల మండలం పాడేరు గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్‌బాషా, షబాన దంపతులు. వారికి సయ్యద్ సుహాన, బాబు జలీల్ సంతానం. మస్తాన్‌బాషా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుహాన చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతోంది. ఇటీవల అనారోగ్యానికి గురవగా నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చూపించారు.బాలికను పరీక్షించిన వైద్యులు రెండు కిడ్నీలు చెడిపోయాయని మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆ ఆస్పత్రిలో 26 రోజులుగా వెంటిలేటర్‌పై బాలికకు చికిత్సను కొసాగిస్తున్నారు. తల్లిదండ్రులు తమకున్న కొద్ది పొలాన్ని అమ్మి పాప వైద్యం కోసం ఇప్పటి వరకు రూ.16 లక్షలు ఖర్చు చేసారు. మరో రూ.10 లక్షల వరకు వైద్యం కోసం ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఏమి చేయాలో తోచని దీనస్థితిలో తల్లిదండ్రులు కడుపులో బాధను దిగమింగుకుని దాతల సాయం కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. ఆర్థిక సాయం చేసే దాతలు 79958 10085 నంబర్‌కు ఫోన్‌చేసి సహకరించాలని కోరారు.

పత్తి పంట పరిశీలన

కొండాపురం: మండలంలోని సాయిపేట, ఇస్కపాళెం గ్రామాల్లో సాగుచేసిన పత్తి పంటను ఏఓ ప్రసూన శుక్రవారం పరిశీలించారు. పత్తి పంటలో సూక్ష్మపోషకాల లోపం ఉన్నట్లు గుర్తించారు. మెగ్నీషియం లోపంతో ఆకులు వాడిపోయి మొక్కలు చనిపోతాయని, నివారణకు లీటరు నీటిలో 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

చేజర్ల: జాతీయ పశువ్యాధుల నియంత్రణా పథకంలో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు చేజర్ల పశువైద్యాధికారి పీ రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి పశువులు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి కోసిన పొలాల్లో జీవాలను మేపడం వల్ల నేల ముర్క వ్యాధి బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. పశువైద్యుల సలహా మేరకు జీవాల్లో నట్టల నివారణ చేపట్టాలన్నారు. 3 నెలలు పై బడిన ప్రతి జీవానికి నేలముర్క వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని సూచించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

మర్రిపాడు: పరిసరాల శుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని ఉదయగిరి సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు సూచించారు. మండలంలోని కంపసముద్రంలో డెంగీ కేసు నమోదవడంతో వైద్యసిబ్బంది శుక్రవారం పర్యటించారు. వైద్యసిబ్బంది నాలుగు బృందాలుగా విడిపోయి ఇంటింటికి తిరిగి లార్వా సర్వే చేపట్టారు. ఇళ్లలోని నిల్వ నీటిని తొలగించి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎన్ కొండారెడ్డి, సిబ్బంది కొండారెడ్డి, సంపూర్ణమ్మ, సైదా, ఖాజామొహిద్దీన్, అంకిరెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

అల్లూరు: మోటార్‌సైకిల్‌పై అక్రమంగా విక్రయించేందుకు తరలిస్తున్న మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వివరాలు..విడవలూరు మండలం పార్లపల్లికి చెందిన జానా నాగరాజు, సాయి వావిళ్లలోని మద్యం దుకాణంలో 150 మద్యం బాటిళ్లను కొనుగోలు చేశారు. అల్లూరు మండలంలో అధిక ధరలకు విక్రయించేందుకు మోటార్‌సైకిల్‌పై వస్తుండగా బీరంగుంట రైస్‌మిల్ కాలనీ వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. 150 బాటిళ్లలో పగిలిపోగా మిగిలిన వాటిని సీజ్ చేశారు. వారిచ్చిన సమాచారంతో వావిళ్ల మద్యం దుకాణం సేల్స్ మేనేజర్ కాటంగారి మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది హేమచంద్ర పాల్గొన్నారు.

గ్యాస్ ధరలను తగ్గించాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తోందని సీపీఎం నాయకులు విమర్శించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు లక్ష్మీపతి మాట్లాడుతూ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ సిలిండర్ రూ.460 నుంచి రూ.1150కు చేరుకుందన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో అల్లాడుతున్న ప్రజలపై మరింత భారం మోపకుండా పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మహిళా నాయకురాలు గుల్జార్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తిరుమంజన సేవ



మెట్లపూజ చేస్తున్న భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహనసేవలకు ప్రారంభఘట్టమైన తిరుమంజన సేవను శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేదగిరి కళ్యాణ చక్రవర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువనే తిరుమంజన సేవను ప్రారంభించారు. వైఖానస ఆగమశాస్త్రానుసారం పాలు, పెరుగు, నీరు, తేనె, కొబ్బరినీళ్లు, సుగంధ ద్రవ్యాలతో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, ఉత్సవరులను అభిషేకించారు. అనంతరం అంతరాలయంతో పాటు ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. తిరుమంజనసేవలో వినియోగించిన సుగంధ ద్రవ్యాలు, పసుపు, కుంకుమలు కలిసిన నీళ్లతో ఆలయ ప్రాంగణంలో సుగంధ పరిమళాలు అలుముకున్నాయి. తిరుమంజన సేవ అనంతరం అలంకార మండపంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. లక్ష్మీవల్లభుడికి ప్రీతిపాత్రమైన తులసీమాలలతో శ్రీవారిని, ఉభయనాంచారులను అలంకరించి ఉత్సవమూర్తులకు నూతనవస్త్రాలను సమర్పించారు. హారతి అనంతరం సహస్రధారతో మరోమారు మహాశుద్ధి కార్యక్రమంగా అభిషేకించారు. సర్వాభరణ అలంకారంలో స్వామికి మంగళహారతిని సమర్పించి అంతరాలయ దర్శనాన్ని కొనసాగించారు.

భక్తిశ్రద్ధలతో మెట్లపూజ

బ్రహ్మోత్సవాలలో స్వామివారిని సేవించి తరించేందుకు వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో మెట్లపూజ నిర్వహించారు. దీర్ఘసుమంగళిగా వర్ధిల్లాలని, భర్త, పిల్లలు, కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మెట్ల మార్గాన్ని పసుపు కుంకుమలతో పూజించి హారతులిచ్చారు. యువతులు అధిక సంఖ్యలో మెట్లపూజలో పాల్గొని పూజలు నిర్వహించారు. సంతానలేమితో బాధపడుతూ కొడిముద్దల స్వీకరణకు వచ్చిన మహిళలు అధిక సంఖ్యలో మెట్లపూజ, గోపూజల్లో పాల్గొన్నారు.

ఔదంబర వృక్షానికి ప్రత్యేక పూజలు

బిలకూట క్షేత్రంలో ఈశాన్యం వైపున ఉన్న ఔదంబర వృక్షానికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్పవృక్షంతో సమానంగా భావించే ఔదంబర వృక్షానికి ముడుపులు కట్టి పూజలు చేస్తే సంతాన భాగ్యం కలుగుతుందనే విశ్వాసంతో నూతనంగా వివాహమైన మహిళలు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు పట్టణంలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ సర్దార్, నాయకులు ఐవీ రమణారెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా సతీమణి పర్వతరెడ్డి ప్రవీణ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పీడీఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, బాబురెడ్డిని గెలిపించాలని సీపీఎం, జేవీవీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

ఉదయగిరి: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్లురెడ్డి, పీ బాబురెడ్డిని గెలిపించాలని పట్టణంలో సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు.

అనుమసముద్రంపేట: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఏఎస్‌పేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. మండల జేసీఎస్ కోఆర్డినేటర్ పులిమి రమేష్‌రెడ్డి, నాయకులు రియాజ్ అహ్మద్, ఖాదర్‌సాహెబ్, హరికృష్ణారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

సోమశిల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు అనంతసాగరంలో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ బొర్రా శోభ, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి



మెప్మా సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ రవీంద్ర

ఆత్మకూరు: మెప్మా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని మెప్మా పీడీ రవీంద్ర అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మెప్మా సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలన్నారు. 15వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న 42 అర్జీలను పరిశీలించి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే పొదుపు మహిళలకు ప్రోత్సాహకంగా వడ్డీలేని రూ.30వేల రుణాన్ని అందించేలా బ్యాంకర్లతో మాట్లాడాలని సూచించారు. పీఎఫ్ స్వనిధి రుణాలు సైతం త్వరగా అయ్యేలా చూడాలన్నారు. నిర్దేశించిన గడువులోగా రుణాలు మంజూరు చేయించడంతో పాటు రికవరీల్లోనూ మెప్మా సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు, మెప్మా సీఎంఎం అంకయ్య, టీఎల్ఎఫ్ ప్రమీల, సీఓ మాధవి, అబీజ్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.